

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు
కొనుగోలు కేంద్రాల్లో తూకాలు ముందుకు సాగకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.
- 9లో ▸



మంజీరలో ఇసుకాసురులు
మంజీర వాగునుంచి అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను తోడేస్తున్నారు. అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
40.0 /22.8
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిజామాబాద్‌లో 71.92 శాతం పోలింగ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నిజామాబాద్‌ పార్లమెంట్‌ స్థానంలో ఓటర్లు పోటెత్తారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు, యువ ఓటర్లు భారీగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాలామంది విదేశాల నుంచి కేవలం ఓటు వేసేందుకే తరలిరావడం చైతన్యానికి నిదర్శనం. దీంతో నిజామాబాద్‌ లోక్‌సభ స్థానం పరిధిలో 71.92 శాతం పోలింగ్‌ నమోదైంది. 2019 పార్లమెంట్‌ ఎన్నికలతో పోలిస్తే 3.55 శాతం ఎక్కువ. 2019లో 68.37 శాతం మంది ఓటేశారు. రిటర్నింగ్‌ అధికారి, కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు మంగళవారం పోలింగ్‌ గణాంకాలను అధికారికంగా వెల్లడించారు. మొత్తం 17,04,867 మంది ఓటర్లకుగాను 12,26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 6,73,624 మంది, పురుష ఓటర్లు 5,52,465 మంది, ఇతరులు 44 మంది ఉన్నారు.

ఇంటర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి మోడల్‌ కళాశాలలో ఇంటర్‌ అడ్మిషన్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్‌ సాయిబాబా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌ ఫస్టియర్‌లో అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో మెరిట్‌ ఆధారంగా అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు.

కేజీబీవీలో..

బీబీపేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్‌ తెలిపారు. ఆరో తరగతితోపాటు ఇంటర్‌ ఫస్టియర్‌ బైపీసీలో 40 సీట్లు, ఎంపీసీలో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేను పక్కా లోకల్‌

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడ రూరల్‌: ''ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయి. బయటి నాయకులు ఓట్లు కాగానే వాళ్ల ఊళ్లకు వెళ్లిపోతారు. నేను మాత్రం లోకల్‌. బాన్సువాడనే నా ఊరు, ఇక్కడే నా ఇల్లు.. బాన్సువాడ ప్రజలే నా కుటుంబ సభ్యులు'' అని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన బాన్సువాడ పట్టణంలోని ఇమ్రాన్‌ టీ స్టాల్‌లో స్థానిక నాయకులతో కలిసి టీ తాగారు. స్థానికులతో ముచ్చటించారు. టీ తాగి ఇంటికి వెళ్తుండగా.. రోడ్డుపై మామిడి పండ్లు అమ్ముకుంటున్న మహిళ ఆయనను మాట్లాడించింది. మామిడి పండ్లను ఆయనకు అందించింది. ఎన్నికల పనుల్లో నిన్నటి వరకు క్షణం తీరిక లేకుండా గడిపిన ఎమ్మెల్యే.. పోలింగ్‌ ప్రక్రియ పూర్తవడంతో మంగళవారం పట్టణంలో పర్యటించి సరదాగా గడిపారు.

లెక్క తేలింది..!

- 74.63 శాతం పోలింగ్‌ నమోదు
- స్ట్రాంగ్‌ రూంలకు చేరిన ఈవీఎంలు
- అందరిలోనూ గెలుపు ధీమా
- ఫలితాల కోసం 20 రోజులు ఆగాల్సిందే..

ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు పోలయ్యాయో లెక్క తేలింది. జహీరాబాద్‌ నియోజకవర్గంలో 74.63 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది గత పార్లమెంట్‌ ఎన్నికలకన్నా(69.67 శాతం) సుమారు ఐదు శాతం అధికం. పోలింగ్‌ ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులు, నాయకులు ఏ పోలింగ్‌ బూత్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు పోలై ఉంటాయన్న అంచనాలలో బిజీగా ఉన్నారు.

సాక్షి, కామారెడ్డి : జహీరాబాద్‌ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కలిపి 74.63 శాతం నమోదైంది. పార్లమెంట్‌ నియోజకవర్గం పరిధిలో 16,41,410 ఓట్లు ఉండగా, 12,25,049 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులలో 75.83 శాతం ఓటు హక్కు వినియోగించుకోగా.. మహిళలలో 73.48 శాతం ఓటేశారు. పోలింగ్‌ కేంద్రాల నుంచి సోమవారం రాత్రి వరకు ఈవీఎంలు ఆయా నియోజకవర్గ కేంద్రాలకు చేరాయి. అక్కడి నుంచి మంగళవారం కౌంటింగ్‌ కేంద్రానికి భారీ భద్రత మధ్య తరలించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని గీతం కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూంలో ఈవీఎంలను భద్రపరిచారు. వచ్చేనెల 4వ తేదీన ఓట్లను లెక్కించనున్నారు.



పటాన్‌చెరులోని స్ట్రాంగ్‌ రూంలో ఈవీఎంలను భద్రపరిచిన అధికారులు

ఎవరికి ఎన్ని ఓట్లో..

ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూడు ప్రధాన పార్టీలు జోరుగా ప్రచారం చేశాయి. శక్తియుక్తులన్నింటినీ ప్రదర్శించాయి. పోలింగ్‌ పూర్తి కావడంతో ఆయా పార్టీల నేతలు బూత్‌ కమిటీల నేతలతో సమావేశమవుతూ ఓట్ల లెక్కలు వేసుకుంటున్నారు. పోలింగ్‌ కేంద్రాల వారీగా పోలైన ఓట్లలో తమకు ఎన్ని వోట్లు వస్తాయన్న దానిపై అంచనాలు వేస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులూ గెలుపు ధీమాతో ఉన్నా.. రెండు జాతీయ పార్టీల మధ్యే పోరు సాగినట్టు పోలింగ్‌ సరళిని పరిశీలిస్తే స్పష్టమవుతోంది. రెండుసార్లు బీఆర్‌ఎస్‌ తరఫున పోటీ చేసి వరుసగా ఎంపీగా విజయం సాధించిన బీబీ పాటిల్‌.. ఈసారి బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. బీజేపీ, మోదీ హవా తనకు కలిసి వస్తాయన్న ధీమాతో పాటిల్‌ ఉన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పార్టీ నుంచి పోటీ చేసిన మాజీ ఎంపీ సురేశ్‌ షెట్కార్‌.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. కాగా బీఆర్‌ఎస్‌ పార్టీకి పడే ఓట్లు గెలుపు ఓటములను ప్రభావితం చేసే అవకాశాలున్నాయి. బీఆర్‌ఎస్‌కు ఏ మేరకు ఓట్లు పడతాయన్న దానిపై అంచనాలకు రాలేకపోతున్నారు. బీఆర్‌ఎస్‌కు ఓట్లు తగ్గితే ఎవరికి లాభం, ఎవరికి నష్టం అన్న దానిపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు అందరిలోనూ గెలుపు ధీమా ఉన్నా.. ఏదో ఒక మూలన అనుమానాలు వారిని వెన్నాడుతున్నాయి. ఓట్ల లెక్కింపునకు ఇంకా ఇరవై రోజుల సమయం ఉండడంతో అప్పటిదాకా నాయకుల్లో టెన్షన్‌ కొనసాగనుంది.

నియోజకవర్గాలవారీగా పోలైన ఓట్ల వివరాలు..

నియోజక వర్గం	పురుషులు	పోలైన ఓట్లు	మహిళలు	పోలైన ఓట్లు	ఇతరులు	పోలైన ఓట్లు	మొత్తం ఓట్లు	మొత్తం పోలైన ఓట్లు	శాతం
జుక్కల్‌	99,524	77,140	1,03,354	76,715	09	00	2,02,887	1,53,855	75.83
ఎల్లారెడ్డి	1,06,881	82,590	1,16,144	90,337	02	01	2,23,027	1,72,928	77.54
కామారెడ్డి	1,22,474	86,121	1,32,514	96,198	19	06	2,55,007	1,82,325	71.50
బాన్సువాడ	93,762	72,850	1,03,051	78,660	13	06	1,96,826	1,51,516	76.98
నారాయణ్‌ఖేడ్‌	1,18,859	88,921	1,18,373	83,584	09	03	2,37,241	1,72,508	72.71
అందోల్‌	1,22,668	96,859	1,28,187	94,461	05	00	2,50,860	1,91,320	76.27
జహీరాబాద్‌	1,37,694	1,03,616	1,37,866	96,981	02	00	2,75,562	2,00,597	72.80
మొత్తం	8,01,862	6,08,097	8,39,489	6,16,936	59	16	16,41,410	12,25,049	74.63



వైద్యాధికారిపై వేటు పడేనా?

- లైంగిక వేధింపుల ఘటనలో నేడు డీఎంహెచ్‌వోపై విచారణ
- డీఎంహెచ్‌వో, ఫిర్యాదుదారులు హాజరు కావాలని ఆదేశం

కామారెడ్డి టౌన్‌: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) లక్ష్మణ్‌సింగ్‌పై బుధవారం విచారణ జరగనుంది. డైరెక్టర్‌ ఆఫ్‌ పబ్లిక్‌ హెల్త్‌ ఫ్యామిలీ వెల్ఫేర్‌ అడిషనల్‌ డైరెక్టర్‌ అమర్‌సింగ్‌ నాయక్‌ విచారణ జరపనున్నారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు విచారణ ప్రారంభం కానుంది. తమను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నారని జిల్లాలోని పీహెచ్‌సీల మహిళా మెడికల్‌ ఆఫీసర్‌లతో పాటు వైద్యాధికారులు రాష్ట్ర, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌తో పాటు ఫిర్యాదు చేసిన పీహెచ్‌సీల మహిళా మెడికల్‌ ఆఫీసర్‌లు, వైద్యాధికారులు విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

మహిళా అధికారితో విచారణకు డిమాండ్‌

లైంగిక వేధింపుల ఘటనలో మహిళా అధికారులతో విచారణ చేపట్టాలని జిల్లా వైద్యులు డిమాండ్‌ చేస్తున్నారు. ఈ విషయంతో మంగళవారం కలెక్టర్‌ను కలిసేందుకు కొందరు మహిళా వైద్యులు కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్‌ అందుబాటులో లేకపోవడంతో వెళ్లిపోయారు. విచారణకు వచ్చే పురుష అధికారి వద్ద తమ బాధను ఎలా చెప్పుకోవాలని వారు పేర్కొంటున్నారు. మహిళా అధికారులతో విచారణ జరిపించాలని కోరుతున్నారు.

వివాదాస్పద నేపథ్యం..

డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌పై పలు ఆరోపణలున్నాయి. కాంట్రాక్ట్‌ వైద్యులు, స్టాఫ్‌ నర్సులు, సిబ్బంది పోస్టుల భర్తీలో డీఎంహెచ్‌వో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అవినీతి వ్యవహారంలో ఆన్‌లైన్‌ లావాదేవీలపై సాక్ష్యాలతో కాంగ్రెస్‌ నేత ఫిర్యాదు చేయడంతో అప్పట్లో విచారణ జరిపారు. అయితే ఆ ఫైలు ముందుకు కదలడం లేదు. ఓ ప్రజాప్రతినిధి సాయంతో వేటు పడకుండా తప్పించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. వైద్యులు, ఉద్యోగుల డిప్యుటేషన్‌లలో కూడా సదరు వైద్యాధికారి భారీగా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

జిల్లా కేంద్రంలో ఈనెల 8వ తేదీన జరిగిన ఓ సమావేశంలో 'అసలు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారా.. లేక వ్యభిచారం చేస్తున్నారా' అంటూ డీఎంహెచ్‌వో మహిళా వైద్యులతో అనుచితంగా మాట్లాడడం వివాదాస్పదమైంది. ఈ వ్యాఖ్యలపై వైద్యులంతా సీరియస్‌ అయ్యారు. డీఎంహెచ్‌వో లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని 21 మంది వైద్యులు రాష్ట్ర అధికారులతో పాటు కలెక్టర్‌, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. ఏడాదిన్నరగా సదరు అధికారి మహిళా వైద్యులతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, ఆస్పత్రుల తనిఖీల సమయంలో మహిళా వైద్యులను బ్యాడ్‌ టచ్‌ చేస్తుంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును రాష్ట్ర అధికారులు సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించారు. ఈ ఘటనలో డీఎంహెచ్‌వోను సస్పెండ్‌ చేయాలని కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సీరియస్‌ అయినట్లు సమాచారం.

బిడ్డ కోసం బీజేపీతో ఒప్పందం

- మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ విమర్శలు
- జహీరాబాద్‌లో కాంగ్రెస్‌దే గెలుపని ధీమా

కామారెడ్డి టౌన్‌ : మాజీ సీఎం కేసీఆర్‌ తన కూతురు కవిత బెయిల్‌ కోసం బీజేపీతో లోపాయకారి ఒప్పందం చేసుకున్నారని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్‌ షబ్బీర్‌ అలీ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్లాసిక్‌ ఫంక్షన్‌ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల నమ్మకాన్ని కేసీఆర్‌ బీజేపీకి అమ్మేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి ఓటు వేయాలని బీఆర్‌ఎస్‌ నాయకులు ప్రచారం చేశారని ఆరోపించారు. దీంతో ఆ రెండు పార్టీలు ఒకటేనని తేలిపోయిందన్నారు. కేసీఆర్‌కు సెక్యులరిజంపై మాట్లాడే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ గెలవబోయే 11 స్థానాల్లో జహీరాబాద్‌ ఉంటుందని సీఎం చెప్పార న్నారు. కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి సురేశ్‌ షెట్కార్‌కు కామారెడ్డిలో బంపర్‌ మెజారిటీ వస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ

అకాల వర్షాలతో కామారెడ్డి నియోజకవర్గంలో 10,420 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని షబ్బీర్‌ అలీ పేర్కొన్నారు. రాష్ట్రంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10 వేల చొప్పున ప్రభుత్వం రూ.15 కోట్లు విడుదల చేస్తే అందులో రూ.10 కోట్లకుపైగా కామారెడ్డి రైతులకు అందనుందన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్‌ రెడ్డికి కామారెడ్డి ప్రాంత సమస్యలపై వినతి పత్రం ఇచ్చానని, వాటిని పరిష్కరిస్తామని ఆయన చెప్పారని పేర్కొన్నారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఇందుప్రియ, నాయకులు పాల్గొన్నారు.

ఎగిరేది కాషాయ జెండానే

- జహీరాబాద్‌లో లక్ష మెజారిటీ ఖాయం
- పార్లమెంట్‌ ప్రభారి పెద్దోళ్ల గంగారెడ్డి

బిచ్కుంద : జహీరాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గంలో బీజేపీ గెలవడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ప్రభారి పెద్దోళ్ల గంగారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. మంగళవారం బిచ్కుందలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ గెలుపును అడ్డుకోవడానికి కాంగ్రెస్‌ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసిందన్నారు. బీజేపీ కార్యకర్తలపై దాడులు చేయించారని, కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. అయినా దాడులకు భయపకుండా బీజేపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశాయన్నారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రజలు కాషాయ పార్టీకే మద్దతుగా నిలిచారన్నారు. కార్యకర్తల కృషితో బీబీ పాటిల్‌ లక్ష పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలుస్తారన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్రీధర్‌ పంతు లు, మండల అధ్యక్షుడు మల్లికార్జున్‌, నాయకులు శివాజీ, విష్ణు, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుందలో మాట్లాడుతున్న పెద్దోళ్ల గంగారెడ్డి

కొనుగోలు కేంద్రాల్లో తిప్పలు

- లారీలు రావు.. రైస్‌ మిల్లులకు ధాన్యం బస్తాలు పోవు
- పట్టించుకోని సొసైటీల నిర్వాహకులు, అధికారులు

నిజాంసాగర్‌(జుక్కల్‌): యాసంగి పంట నూర్పిళ్లు చేసి కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం కుప్పలు పోసిన రైతులు విక్రయాలకు తిప్పలు పడుతున్నారు. తూకం చేసిన ధాన్యం బస్తాల తరలింపునకు లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోతున్నాయి. లారీలు రాక రైస్‌ మిల్లులకు ధాన్యం బస్తాలు తరలించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 334 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వరిధాన్యం సేకరణ చేపడుతున్నారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 2.3 లక్షల మెట్రిక్‌ టన్నుల వరిధాన్యాన్ని సేకరించారు. లక్షకు పైగా మెట్రిక్‌ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలకు సిద్ధంగా ఉంది. గడిచిన 15 రోజుల నుంచి కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం విక్రయాలు సక్రమంగా ముందుకు సాగడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వరిధాన్యం బస్తాల తరలింపునకు లారీలు రాకపోవడంతో తూకాలు మందకొడిగా సాగుతున్నాయి. అంతే కాకుండా రైస్‌ మిల్లుల్లో ధాన్యం బస్తాల నిల్వలు పేరుకుపోవడంతో రైస్‌ మిల్లర్లు ఆసక్తి చూపడం లేదు. వరిధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీలు వారం రోజుల పాటు ఖాళీ కాకపోవడంతో లారీల కొరత తీవ్రంగా ఉంది. అంతే కాకుండా మిల్లర్లు కడ్తా పేరిట బస్తాకు రూ.2 కిలోలు తరుగు ఇస్తే ధాన్యం బస్తాలను తీసుకుంటామని షరతులు విధిస్తున్నారు.



గున్కుల్‌ కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

వారం రోజులుగా నిలిచిన కొనుగోళ్లు

నిజాంసాగర్‌, మహమ్మద్‌నగర్‌ మండలాల్లోని మాగి, వెల్గనూర్‌, ఆరేడ్‌, బ్రాహ్మణపల్లి, హసన్‌పల్లి, మహమ్మద్‌ నగర్‌, బూర్గుల్‌, తుంకిపల్లి, కోమలంచ, గాలీపూర్‌, ముగ్దుంపూర్‌ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వారం రోజులుగా తూకాలు అర్ధంతరంగా నిలిచాయి. ఆయా కేంద్రాలకు లారీలు రాకపోవడంతో ధాన్యం బస్తాలు పేరుకుపోయాయి. ధాన్యం బస్తాలు రైస్‌ మిల్లులకు తరలించకపోవడంతో హమాలీలు తూకాలను నిలిపి వేశారు.

వడ్లు అమ్మి వారం రోజులైంది



వడ్లు అమ్మి వారం రోజులవుతున్నా ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. లారీలు రాకపోవడంతో రాత్రింబవళ్లు ధాన్యం బస్తాల వద్ద కాపాలా ఉంటున్నా. ఐదు ఎకరాల్లో పంట పండించినా తిప్పలు కాలేదు కానీ వడ్ల బస్తాల కాడ కాపలా ఉండాలంటే దు:ఖం వస్తుంది.

– మొట్ట అంజయ్య, రైతు గున్కుల్‌

అమ్ముకోవడం మరో ఎత్తు



ఆరుగాలం కష్టపడి పంట పండించడం ఒక్క ఎత్తైతే వడ్లు అమ్ముకోవడం మరో ఎత్తు. వారం రోజుల కిందట 858 బస్తాలు కాంటా పెట్టించి రైస్‌ మిల్లుకు లారీ పంపించినా. ఇప్పటికి రైస్‌ మిల్లులో లారీ ఉంది కాని బస్తాలను ఖాళీ చేసుకోలేదు. ఇంకా కొనుగోలు కేంద్రంలో 175బస్తాలు ఉన్నాయి. అధికారులు స్పందించాలి.

– రియాజ్‌, రైతు, కోమలంచ

'ఎప్పటికప్పుడు వడ్లు తరలించాలి'

కామారెడ్డి క్రైం : మరో రెండు రోజుల పాటు ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రాత్రి పూట కూడా లారీలలోకి లోడ్‌ చేయాలని అదనపు కలెక్టర్‌ చంద్ర మోహన్‌ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. కామారెడ్డి మండలం శాబ్దిపూర్‌, క్యాసంపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలు, పాల్వంచ మండలం భవానీపేటలోని రైస్‌మిల్లులను మంగళవారం ఆయన పరిశీలించారు. మిల్లర్లు, కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం రాశులను త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్డ్‌ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. మిల్లులకు వచ్చిన లారీలను 24 గంటలలోగా అన్‌ లోడ్‌ చేసుకోవాలని సూచించారు. ఈ రబీ సీజన్‌లో ఇప్పటి వరకు 42,142 మంది రైతుల నుంచి రూ.526 కోట్ల విలువ గల 2,38,488 మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రూ.441 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామని తెలిపారు. డీఎస్‌వో మల్లికార్జున్‌ బాబు, డీటీలు పాల్గొన్నారు.



నిర్వాహకులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌

ధాన్యం నిల్వలు ఉంచొద్దు

కామారెడ్డి క్రైం : సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌ సూచించారు. మంగళవారం తన ఛాంబర్‌లో సహకార సంఘాల అధికారులు, నిర్వాహకులతో దాన్యం నిల్వలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ మలిఖార్జున్‌ బాబు, సివిల్‌ సప్లయ్‌ కార్పొరేషన్‌ ఇన్‌చార్జి డీఎం నిత్యానందం, సహకార సంఘాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌

క్లుప్తంగా

నరసింహునికి చంద్ర వాహన సేవ



భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఉత్సవాలు రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. ఆలయంలో స్వామి వారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం దీపారాధన, స్వస్తి పుణ్యహవచనం, మా తృక, మంటప దేవతా స్థాపన కార్యక్రమాలు నిర్వ హించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన చంద్ర వాహనంపై స్వర్ణభరణా లు అలంకరించిన శ్రీ లక్ష్మీ నరసింహుల ఉత్సవ విగ్రహాలను ఉంచి అంగరంగవైభవంగా ఊరేగించారు. భక్తులు లక్ష్మీ నరసింహులను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలోగల శ్రీదేవి–భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ ద్వాదశ వార్షికోత్సవాల్లో భాగంగా వేదపండితులు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉదయం హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి వారి కర కమలములచే 108 కలశములతో మహా కుంబాభిషేకం నిర్వహించారు. అలాగే రమా సహిత సత్యనారాయణ స్వామి అభిషేకం, శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి అభిషేకం, బలి ప్రధానము, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నప్రసాదములు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహించారు. వేడుకలను బ్రహ్మశ్రీ వేలేటి పశుపతి శర్మ, బ్రహ్మశ్రీ ఉమా మహేశ్వర శర్మ, ఆలయ ప్రధానార్చకులు రాహుల్ త్రిపాఠి నిర్వహించారు. ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ వార్షికోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు ఆలయ ధర్మకర్త రావుల బ్రహ్మానందం తెలిపారు. సభ్యులు కొనరాజు నాగార్జున, నాయుడు ఆంజనేయులు, రవిబాబు, పెదవలి నాగేశ్వర రావు, జంపాని లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

యూనియన్‌లో చేరిక

నిజామాబాద్‌నాగారం : విద్యుత్‌శాఖ 327 యూనియన్(ఐఎన్‌టీయూసీ)లో మంగళవారం టీఆర్‌వీకేఎస్ యూనియన్ నాయకులు, సభ్యులు భారీగా చేరారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయ ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి పూదరి గంగాధర్ ఆధ్వర్యంలో చేరికల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా 327 యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఇనుగాల శ్రీధర్ హాజరై, మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమ కోసం యూనియన్ అండగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన సమక్షంలో టీఆర్‌వీకేఎస్, హెచ్–58 యూనియన్‌ల నుంచి జూనియర్ లైన్‌మెన్, ఆర్టిజన్‌లు చేరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేష్, వేణుగోపాల్‌రావు, పెంటయ్యచారి, మనోహర్, మోహన్, శ్రీనివాస్, ముస్తాక్, నగేష్, కళ్యాన్, ప్రభు, సతీష్, నరింహాలు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా రోడ్డుపై అవస్థలెన్నో?

- కోతకు గురైన రోడ్డు.. ప్రమాదకరంగా మూలమలుపులు
- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ప్రయాణికులు



రెండు వైపులా కోతకు గురైన రోడ్డు



రోడ్డును ఆనుకొని ఏర్పడిన గుంతలు



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

సిరికొండ: జాతీయ రహదారి నంబర్ 44 మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనువుగా ఉన్న అంతర్ జిల్లా రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఈ రోడ్డు గుండా నిజామాబాద్ జిల్లా నుంచి కామారెడ్డి జిల్లాతోపాటు రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు త్వరగా వెళ్లొచ్చు. జిల్లాలోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్, భీమ్‌గల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు హైదరాబాద్‌కు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే రోడ్డుపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతర్ జిల్లా రోడ్డు మీదుగా ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు మండలంలోని కొండాపూర్ మీదుగా కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేట తండా వరకు దట్టమైన అటవీ ప్రాంతం గుండా వెళ్లాల్సి ఉంటుంది. అటవీప్రాంతానికి అటు, ఇటు వైపు ఉన్న రోడ్డును రెండు వరుసలగా విస్తరించినప్పటికీ.. తొమ్మిది కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతంలోని రోడ్డు సింగిల్ రోడ్డుగానే ఉంది. రోడ్డు విస్తరణకు అటవీ శాఖ నుంచి అనుమతులు లభించడం లేదనే కారణంగా విస్తరించడం లేదు. సింగిల్ రోడ్డులో అరకిలోమీటరు దూరం మినహా మిగతా భాగం కామారెడ్డి జిల్లా రోడ్లు, భవనాల శాఖ పరిధిలో ఉంది. మండలంలోని కొండాపూర్, తూంపల్లి, ముషీర్‌నగర్, గడ్కోల్, తాళ్లరామడుగు తదితర గ్రామాలకు చెందిన ప్రజలు కామారెడ్డి దగ్గర కావడంతో నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. ఈ రోడ్డు రెండు జిల్లాలతోపాటు రెండు నియోజకవర్గాల పరిధిలో ఉండటంతో రోడ్డు విస్తరణకు మోక్షం లభించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రమాదాలకు నెలవు..!

అటవీ ప్రాంతం మీదుగా సాగే రోడ్డులో తొమ్మిది చోట్ల ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి. అటవీ ప్రాంతం కావడంతో వర్షాకాలంలో వరదలకు చాలా చోట్ల రోడ్డుకు ఇరు వైపులా మట్టి కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మార్గంలో ఒక వైపు ప్రమాదకరంగా మూలమలుపులు ఉండగా అదే చోట మట్టి కోతకు గురై రోడ్డుకు ఇరు వైపులా భారీగా గుంతలు ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటవీ ప్రాంతం మధ్యలో ఒర్రెపై నిర్మించిన కల్వర్టు వద్ద వరద రోడ్డు పైనుంచి నీరు ప్రవహించడంతో సగభాగం వరకు కోతకు గురైంది. ఈ అటవీ ప్రాంతంలో చిరుతలతోపాటు ఎలుగుబంట్లు, అడవి పందులు ఉన్నాయి. సాయంత్రం నుంచి ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి చిరుతలతోపాటు ఇతర వన్యప్రాణులు తారసపడుతుంటాయి. గడ్కోల్, తూంపల్లి, కొండాపూర్‌తోపాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులకు ఈ మార్గంలో రోడ్డు దాటుతు చిరుత కనిపించిన సందర్భాలు ఉన్నాయి. కొండాపూర్ వైపు నుంచి వెళ్తుండగా వచ్చే తొలి మూలమలుపు వద్ద గత మూడేళ్ల కిందట బైక్ వంతెనను ఢీకొన్న ఘటనలో ఒక బాలుడు మృతి చెందాడు. ఇదే మూలమలుపు వద్ద ఏడేళ్ల క్రితం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వ్యక్తి బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. అటవీ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో భీమ్‌గల్ మండలం గోనుగొప్పులకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. రోడ్డు ప్రమాదాల్లో పది మంది వరకు మృత్యువాత పడ్డారు. ప్రమాదాలకు నెలవుగా మారిన ఈ రోడ్డును విస్తరించి మూలమలుపులను తొలగించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



కామారెడ్డికి వెళ్లే మార్గంలో కొండాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న సింగిల్ లేన్ రోడ్డుపై ప్రయాణించాలంటే అవస్థలు పడుతున్నాం. మా గ్రామం నుంచి ప్రతి రోజూ చాలా మంది ఏదో ఒక పనిపై ఈ రోడ్డు గుండానే కామారెడ్డికి వెళ్తుంటారు. రోడ్డును విస్తరించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డును విస్తరిస్తే చాలా సౌకర్యంగా ఉంటుంది. – రహీం, కొండాపూర్

అటవీశాఖ అనుమతి రావాల్సి ఉంది

కొండాపూర్ అటవీ ప్రాంతంలోని రోడ్డు విస్తరణకు మా శాఖ తరఫున ఐదేళ్ల క్రితమే అన్ని ప్రతిపాదనలు రూపొందించాం. నిధులు సైతం మంజూరయ్యాయి. రోడ్డు విస్తరణకు అటవీ శాఖ నుంచి అనుమతి రావాల్సి ఉంది. అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో ఆ నిధులు రద్దయ్యాయి. అటవీ శాఖ అనుమతులు రాగానే మళ్లీ నిధులు మంజూరు చేయిస్తాం.

– శ్రీనివాస్, కామారెడ్డి ఆర్ అండ్ బీ డీఈ

అర్బన్‌లో పెరిగిన పోలింగ్ శాతం



నిజామాబాద్‌అర్బన్: అర్బన్ నియోజకవర్గం పరిధిలో క్రమంగా ఓటింగ్ శాతం పెరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అర్బన్ నియోజకవర్గం పరిధిలో 289 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా, గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్ శాతం పెరిగింది. ప్రతి ఎన్నిక పోలింగ్ సందర్భంగా జిల్లాలో వెనుకంజలో ఉన్న అర్బన్ నియోజకవర్గంలో అధికారుల విస్తృత ప్రచారం కారణంగా ఓటింగ్ శాతం పెరుగుతోంది. సోమవారం నాటి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో.. ఉదయం కాస్త నెమ్మదిగా ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 12 గంటల తరువాత పుంజుకుంది. ముఖ్యంగా మైనార్టీ ఏరియల్లో నెమ్మదిగా ప్రారంభమై సాయంత్రం వేళ ఓటింగ్ శాతం పెరిగింది. వేసవి తీవ్రత దృష్ట్యా ఎక్కువ ఓటర్లు ఉదయమే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. కంఠేశ్వర్, గంగాస్థాన్, సుభాష్‌నగర్, గౌతంనగర్, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం వేళ ఓటింగ్‌శాతం పెరగగా.. మాలపల్లి, ఖిల్లా, అర్సపల్లి ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళ పెరిగింది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఈసారి అధికారులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దీనికితోడు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సైతం తమ గెలుపు కోసం ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించే ప్రక్రియ చేపట్టారు.

అర్బన్ నియోజకవర్గంలో నమోదైన ఓటింగ్ వివరాలు

2019 లోక్‌సభ ఎన్నికల్లో..		
మొత్తం ఓటర్లు	ఓటేసినవారు	శాతం
2,68,429	1,51,002	56.24
2024లో లోక్‌సభ ఎన్నికల్లో..		
మొత్తం ఓటర్లు	ఓటేసినవారు	శాతం
3,04,317	1,88,159	61.83
2023 అసెంబ్లీ ఎన్నికల్లో..		
మొత్తం ఓటర్లు	ఓటేసినవారు	శాతం
2,94,832	1,81,811	61.67

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 56.24 శాతం ఓటింగ్ నమోదైంది. ప్రస్తుత ఎన్నికలసందర్భంగా 61.83 శాతం ఓటింగ్ నమోదైంది. గతంతో పోలిస్తే పోలింగ్ శాతం బాగానే పెరిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 61.67 శాతం ఓటింగ్ నమోదైంది.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్య పొందేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సంక్షేమ శాఖ అధికారిణి శశికళ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ ఏడాది పదో తరగతిలో 7 జీపీఏకు మించి మార్కులు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎంసెట్ కోసం..

ఈ ఏడాది పదో తరగతిలో 7 జీపీఏకు మించి మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఎంసెట్ ప్రవేశ పరీక్ష ప్రత్యేక శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు అభినందన

నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసినందుకు జిల్లాలోని పలువురు విద్యుత్ అధికారులకు సీఎండీ వరుణ్‌రెడ్డి ఆఫీసర్ ప్రత్యేకంగా అభినందించారని విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని కోటగిరి, సుభాష్‌నగర్, ఆర్మూర్ ఏఈ – 2, టౌన్ – 2 ఏడీఈ, నవీపేట్ ఏడీఈలను ప్రత్యేకంగా అభినందించారన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు గాలివాన బీభత్సం సృష్టించినప్పటికీ.. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, దీంతో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



మోపాల్: ట్రాక్టర్ బోల్తా పడి మండల కేంద్రానికి చెందిన మెట్టు ఆకాశ్ (21) మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆకాశ్ ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్ తీసుకొని సోమవారం కంజర నుంచి మోపాల్‌కు వస్తుండగా, కంజర శివారులోని రైస్‌మిల్ వద్ద అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఆకాశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మెట్టు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

బాన్సువాడ: పట్టణంలోని షేక్ చాంద్ హోటల్ సమీపంలో సోమవారం సాయంత్రం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 80088 09152 నంబర్‌ను సంప్రదించాలని సీఐ కృష్ణ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వేల్పూర్: మండలంలోని అమీనాపూర్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో వేల్పూర్‌కు చెందిన విశ్వతేజ్‌కు తీవ్రగాయాలైనట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. విశ్వతేజ్ తన బైక్‌పై పెర్కిట్ వైపు వెళ్తుండగా, వేల్పూర్ వైపు మరో వ్యక్తి బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో విశ్వతేజ్ కుడికాలు విరిగడంతోపాటు కుడిచేయికి గాయాలైనట్లు తెలిపారు. బాధితుడి తండ్రి చల్ల సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రేమ వివాహం

ఇందల్వాయి: యువజంట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ప్రేమ వివాహం చేసుకున్నట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు సిరికొండ మండలం గడ్కోల్‌కు చెందిన యువతి ప్రేమించుకున్నారని, వారు పోలీసులను ఆశ్రయించి పెళ్లి చేసుకున్నారన్నారు. ప్రేమ వివాహానికి పెద్దలను ఒప్పించినట్లు ఎస్సై తెలిపారు.

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

- మొదటి భార్య వేధిస్తోందని ఆవేదన
- పోలీసులకు ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటగల్లీలో భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన చేపట్టింది. బాధితురాలు మనస్విని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కోటగల్లీకి చెందిన మనస్విని అదే ప్రాంతానికి చెందిన సిరిపురం శ్రీనివాస్ 2016లో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి సమయంలో మనస్వినికి అత్తగారు ఇంటిని బహుమతిగా ఇచ్చారు. అదే ఇంట్లో కొన్ని సంవత్సరాలుగా ఆమె నివాసం ఉంటోంది. ఈ క్రమంలో శ్రీనివాస్ మొదటి భార్య సవిత వచ్చి ఇల్లు ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతోంది. దీంతో సవిత నివాసం ఉంటున్న ముంబయికి వెళ్లిన మనస్విని అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమోటోగా స్వీకరించిన జిల్లా కోర్టు నిజామాబాద్‌లోని నాల్గోటౌన్ పోలీసులకు బదిలీ చేసింది. సవితతోపాటు ఆమె తరఫువారు గత శనివారం ఇంటికి వచ్చి దాడి చేశారని మనస్విని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భత్యంపై ఉద్యోగుల్లో సంతోషం

- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ చెల్లింపు
- గతంలో ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా..
- ఈసారి రాష్ట్రమంతటా ఒకే టీఏ, డీఏ



మోర్తాడ్(బాల్కొండ): ఎన్నికల విధులు నిర్వర్తించిన తమకు ఎన్నికల కమిషన్ చెల్లించిన భత్యంపై ఉద్యోగు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శాసనసభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా చెల్లించిన భత్యంతో పోలిస్తే ప్రస్తుతం ఎక్కువే చెల్లించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా ఉద్యోగులకు భత్యం చెల్లించారు. కొన్ని జిల్లాల్లో ఎక్కువగా నిజామాబాద్ జిల్లాలో అతి తక్కువ భత్యం చెల్లించడంతో అప్పట్లో ఉద్యోగులు నిరాశకు గురయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం రాష్ట్రం అంతటా ఒకే రకంగా టీఏ, డీఏ చెల్లించడంతోపాటు భోజన సదుపాయం కల్పించడం, సర్టిఫికెట్లు ప్రదానం చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో పోలింగ్ అధికారి(పీవో)తో పాటు అసిస్టెంట్ పోలింగ్ అధికారి(ఏపీవో), అదర్ పోలింగ్ అధికారి(ఓపీవో)లు విధులు నిర్వహించారు. పోలింగ్ సామగ్రిని రిటర్నింగ్ కార్యాలయం నుంచి తీసుకుని తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ల పరిధిలోని బూత్‌లకు ఆదివారం సాయంత్రం చేరుకుని సోమవారం రోజున పోలింగ్ విధులను నిర్వహించారు. పోలింగ్ అనంతరం మళ్లీ రిటర్నింగ్ కార్యాలయంలో సామగ్రిని అప్పగించడం ఏపీవో, పీవో, ఓపీవోల బాధ్యత. రెండు రోజుల పాటు ఎన్నికల విధులను నిర్వహించినందుకు సర్టిఫికెట్లను అందించడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యం కనిపించినప్పటికీ.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండాపోయిందని ఉద్యోగులు చెబుతున్నారు. తమ విన్నపం మేరకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి ఎన్నికల విధుల సర్టిఫికెట్లను వెంటవెంటనే జారీ చేశారని తెలిపారు.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చెల్లించిన టీఏ, డీఏ

2023 అసెంబ్లీ ఎన్నికల్లో..	
పీవో	రూ.1,700
ఏపీవో	రూ.1,700
ఓపీవో	రూ.1,050
2024 పార్లమెంట్ ఎన్నికల్లో..	
పీవో	రూ.3,150
ఏపీవో	రూ.3,150
ఓపీవో	రూ.1,750

ఆరోగ్య కార్యకర్తలకు తొలిసారి..

- ఒక్కో బూత్‌కు రూ.300 చొప్పున చెల్లింపు

మోర్తాడ్(బాల్కొండ): ఎన్నికల విధులు నిర్వహించిన ఆరోగ్య కార్యకర్తలకు తొలిసారి భత్యాన్ని ఎన్నికల అధికారులు మంజూరు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి అత్యవసర చికిత్స అందించేందుకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో ఏ ఎన్నికల సందర్భంలోనూ వైద్య సిబ్బందికి భత్యాన్ని చెల్లించలేదు. ఈసారి నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని 1,808 పోలింగ్ స్టేషన్‌లకు రూ.300 చొప్పున రూ.5,42,400 విడుదల చేశారు.

ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు ఎంత మంది ఉన్నా.. ఒక్కో బూత్‌కు రూ.300 చొప్పున చెల్లించారు. ఎంతో కొంత భత్యం చెల్లించి తమ పనితీరుకు గుర్తింపు ఇచ్చారని ఆరోగ్య కార్యకర్తలు పేర్కొంటున్నారు.



గుమ్మిర్యాల్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆశ వర్కర్లు(ఫైల్)

పోతులకుంటకు పొంచి ఉన్న ముప్పు!

- చెరువు కట్టను తొలగిస్తూ రోడ్డు విస్తరణ
- సమీపిస్తున్న వర్షాకాలం
- పునః నిర్మాణమెన్నడో?
- ఆందోళనలో రైతులు



చెరువు అంచున కొనసాగుతున్న బైపాస్ రోడ్డు పనులు



పోతులకుంట ప్రధాన తూము వరకు కట్టను తవ్వేసిన దృశ్యం

బోధన్: సాలూర మండల సరిహద్దులోని 63వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధానంగా బోధన్ పట్టణ శివారు నుంచి సాలూర అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టు వరకు 8.3 కిలోమీటర్ల పొడవునా నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల శివార్లలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సాలూర క్యాంప్ శివారులోని పోతులకుంట చెరువు కట్టను ఆనుకుని చేపట్టిన బైపాస్ రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండడంతో చెరువు కట్టను తొలగించారు. చెరువు ప్రధాన తూము అంచు వరకు కట్టను తవ్వేశారు. తూము వద్ద పడమర నుంచి తూర్పు దిశలో సుమారు 50 నుంచి 70 అడుగుల మేర పొడవునా చెరువు కట్టను నెలన్నర క్రితమే తొలగించారు. చెరువు, నిర్వహణ పర్యవేక్షణ నీటిపారుదల శాఖ పరిధిలో ఉంది. ఈ ఏడాది వర్షాలు సకాలంలోనే ప్రారంభమవుతాయని వాతావరణ శాఖ పేర్కొంటుండగా, చెరువు కట్ట పునఃనిర్మాణంలో జాప్యం జరుగుతండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విస్తారంగా వర్షాలు కురిస్తే చెరువులో చుక్క నీరు నిల్వ ఉండే పరిస్థితి ఉండదు. రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షిస్తున్న నేషనల్ హైవే అథారిటీ పరిధిలో చెరువు కట్ట పునర్నిర్మాణం బాధ్యత ఉంటుందని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

గొలుసుకట్టు చెరువు

పోతులకుంట చెరువు కింద సాలూర గ్రామ రైతుల సాగు భూములు 50 నుంచి 60 ఎకరాల వరకు ఉన్నాయి. దిగువన ఉన్న కామక్కచెరువు, ఫత్తేపూర్ చెరువులకు పోతులకుంట అనుసంధానంగా ఉంటుంది. చెరువులో వర్షం నీటిశాతం పెరిగితే దిగువన ఉన్న కామక్క చెరువులోకి వదులుతారు. ఈ చెరువు నుంచి ఫత్తేపూర్ చెరువుకు మళ్లిస్తారు. ఈ మూడు చెరువుల కింద వందలాది ఎకరాల సాగు భూములున్నాయి. వర్షాకాలంలో ఈ భూముల్లో వరి సాగు చేస్తారు. చెరువు కట్ట పునర్నిర్మాణం పనులు యుద్ధప్రాతిపదిక చేపట్టక పోతే రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. నీటిపారుదల శాఖ అధికారులు చొరవ తీసుకొని నేషనల్ హైవే అథారిటీ అధికారులపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

చెరువును పరిశీలిస్తా

సాలూరా క్యాంప్ గ్రామ శివారులోని పోతులకుంట చెరువును బుధవారం పరిశీలిస్తా. నెల రోజుల నుంచి ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యాం. చెరువు కట్ట పునర్నిర్మాణం బాధ్యత నేషనల్ హైవే అథారిటీ పరిధిలో ఉంది.

– లోక్యానాయక్, డీఈ ఇరిగేషన్ శాఖ సబ్ డివిజన్, బోధన్